# తలలు నలుపులైన తలపులు వలపులా!

ప్రొఫెసర్ యవన్ అనబడే యడవల్లి లేక యార్లగడ్డ లేక మరేదో వరాహ నరసింహం అద్దంలో చూసుకుంటూ ముందున్న వక్షం మీద, వెనకాతల ఉన్న వీపు మీద సువాసనలు వెదజల్లే పౌడరు జల్లుకున్నాడు. అద్దంలో అతనికి ఓ అందగాడు కనిపించాడు. పౌడరు చల్లుకొన్నాక తెల్లని టీషర్టు వేసుకున్నాడు. అంతకుముందే అతను నీలం జీన్సు వేసుకున్నాడు. ఆ జీన్సు అతనికి అతని వంశీకులనించి వచ్చినవి కావు. డబ్బు పెట్టి కొనగా అవి షాపు నుంచీ వచ్చాయి. ఆ విధంగా తయారయ్యాక ప్రొఫెసర్ యవన్ మళ్లీ అద్దంలో చూసుకున్నాడు. ఇందాకటి అందగాడీసారి అందంగాను, యవ్వనుడిగాను కనిపించాడు.

ప్రొఫెసర్ యవన్ గ్రీకు శిల్పంలా ఉంటాడు యవన శిల్పానికి ఛాతి మీద వెంట్రుకలుండవు. ఛాతి నిగనిగలాడ్తూ ఉంటుంది. నిజానికి నాకు తెలిసి ఏ శిల్పానికీ ఛాతీ మీద వెంట్రుకలుండవు. కాని యవన శిల్పాల కుండవు అని ఎల్లోరాలో ఏకాంత సేవలో బుచ్చిబాబుగారన్నారు. మిగిలినవాటి మాట ఆయన వదిలి పెట్టాడు. మిగిలిన శిల్పాల మాట ఎలా ఉన్నా గ్రీకు శిల్పాల ఛాతులు నున్నగా ఉంటాయి. ప్రొఫెసర్ యవన్ గ్రీకు శిల్పంలా నున్నటి ఛాతితోను, వీపుతోను ఉంటాడు. అయితే గ్రీకు శిల్పంతో అతన్ని పోల్చటం విషయంలో నిశ్చయంగా తెలియని విషయం ఒకటి ఉంది. అది ప్రొఫెసర్ యవన్ జుట్టు ఉంగరాలు తిరిగి ఉండటం కాదు. శిల్పాలలో కూడా జుట్టు రింగులు తిరిగే ఉంటుండి. మరేమిటి? జుట్టు రంగు గురించి. గ్రీకు శిల్పాలని చూసి మనం జుట్టు రంగు రాగో, నలుపో చెప్పలేము. యవన్‌ది మాత్రం నల్లటి నలుపు. నల్లటి రంగుతోను గ్రీకు శిల్పాలలో వలె రింగులు తిరిగిన జుట్టుతోను ప్రొఫ్. యవనుంటాడు. అంటే ఆక్షేపణ ఉండదు. జుట్టు నల్లగా ఉండటం వల్ల ప్రొఫెసర్ యవన్ త్రిదశుడిలాగానో మూడున్నర దశుడిలాగోనో యవ్వనం ఒలుకుతూ కనిపిస్తాడు. అందుకని అతని ఆ యూనివర్శిటీలో కొందరు ఆచార్య యవన్ అనేకాక ఆచార్య యవ్వన్, ఆచార్య యౌవన్, అని సరదాగా అంటూ ఉంటారు. అసూయగా అంటూ ఉంటారు. అసూయ ఎందుకంటే అతనికి అందంతో పాటు కళ్లల్లో మెరుపు, తెలివైనవాడన్న పేరూ

ఉన్నాయి. అందమైన తెలివైన ప్రొఫెసర్ అంటే స్టూడెంట్స్‌లోగ్లామర్ ఉంటుంది కదా! స్టూడెంట్స్ అంటే అంతా మగవాళ్లే ఉంటారా మరి. కొందరు ఆడపిల్లలూ ఉంటారు కదా. ఆడా మగా మధ్య గ్లామర్ ఉంటే అది గ్లామర్ ఉన్న వ్యక్తి చుట్టూ రెండో జాతిమనుషులు తిరగటంలోకి దారి తీస్తుంది కదా. ఇప్పుడు ఆచార్య యవన్ చుట్టూ కాలేజీలో అమ్మాయిలు ఎమ్మెస్సీ వాళ్లు, పి.హెచ్.డి. వాళ్లు, పెళ్లికాని లెక్చరర్లు తిరుగుతున్నారు కదా! అందులో మేనుక అనే చిన్నది అందమైన చిన్నది ఉంది కదా ఆ పిల్లకి ఆచార్యుడి మీద ఎనలేని ఇది కదా! అందుకండీ అసూయ!

ఇప్పుడా పిల్ల యవన్ కోసం రానున్నది అందుకని అతడు తన గది నుంచి ఋతం తప్పక ఠీవిగా నడుస్తూ హాలు వైపు నడిచాడు. అతని నడక ఒక బలమైన మగ గుర్రం అదీ యవనాశ్వం....నడకలాగా ఠీవిగా ఉంటుంది. అల్లా నడవటం అతను చాలా కష్టపడి అభ్యసించి నేర్చుకొన్నది. అభ్యసించినది వృథా కాకుండా కష్టపడ్తూ ఉంటాడు. అది వేరే విషయం.

ఇంతకూ రాబోతున్న చిన్నదాని పేరు మేనుక అని చెప్పుకున్నాం కదా. ఆ పిల్ల అతని దగ్గర పి.హెచ్.డి. చేస్తోంది. ఆ పిల్ల పేరుకి అర్థం ఏమిటని ఆమె జేరిన ఎకడమిక్ ఇయర్‌లో ఎకడమిక్స్ బుర్రలు బద్దలు కొట్టుకొన్నారు.

కొందరు ఆ పేరుకి అర్థం లేదన్నారు. కొందరు ఈ రోజుల్లో తెలుగు కథల్లోని హీరోయిన్ల పేర్ల కర్థం ఎంతమందికి తెలుసు కనక ఈ పిల్ల పేరుకి అర్థం తెలియలేదని బాధ పడటానికి?! మేనుక అన్న పేరు ఏమేనుదో, ఆ పిల్ల ఏ మేన్‌దో తెలిస్తే చాలు అని బహిరంగంగానే మొదటివర్గాన్ని విసుక్కున్నారు. అయితే ప్రతీదాంట్లో గంభీరమైన అర్థాలు వెదికే మేధావులూర్కోలేదు. వాళ్లు, "మేను అంటే శరీరం, క అన్న ప్రత్యయం చిన్నది అని సూచించటానికి సంస్కృతంలో వాడ్తూ ఉంటారు. కనుక మేనుక అంటే చిన్న శరీరం కలది అని అర్థం. ఆ అర్థం సూచించటానికి ఆమె తల్లి దండ్రులాపిల్లకి ఆ పేరు పెట్టారు. మేనుక పిట్టలాంటిది. ఆమె సార్ధకనామధేయురాలు" అన్నారు.

"అవును యవనాచార్యుడు మంచి పిట్టనే పట్టాడు" అన్నారు మరి కొందరు కొంటెగా.

ఈ పిట్టలాంటి మేనుక పెళ్లీడుకువచ్చి ఎన్ని సంవత్సరాలైందో చెప్పటం కష్టం. కాని కొద్ది సంవత్సరాలలో ఆ ఈడు దాటిపోతుందని ఆమె భయపడ్తోందని గుర్తించడం సులభం.

ప్రొఫెసర్ యవన్ ఓ పెద్ద కంపెనీ టెన్నిస్ జోళ్లు తొడుక్కుంటున్నప్పుడు మేనుక వచ్చి గుమ్మం ముందు సైకిల్ స్టాండు వేసి సైకిల్‌ని నిలబెట్టి, సైకిల్ గంట, ఆపైన తలుపు గంటా మోగించింది. అప్పుడు హాల్లో యవన్ కుర్చీలో కూర్చుని జోళ్లు వేసుకుంటూ ఉండటంవల్ల "జస్ట్ ఎ మినిట్" అని లోపల్నుంచి కేకపెట్టాడు.

అతను తలుపు తీసేలోపల మేనుక మరోసారి బెల్లు కొట్టింది. ఆమెలో ఉత్సాహం

ఉరకలు వేస్తూ, ఆలస్యం పట్ల అసహనం కలిగిస్తూ ఉంటుంది. ఆమెకి సరదాతో గంతులు వేయాలని ఉంటుంది. తనతో సమానంగా గంతులు వేయమని యవన్‌ని కవ్విస్తూ ఉంటుంది.

అతను ఆ కవ్వింపులను ఎప్పుడూ నిర్లక్ష్య పెట్టలేదు. ఛాలెంజిగా తీసుకుని ఆమె కోర్కెల్ని తీరుస్తూ ఉంటాడు - అప్పుడప్పుడు శ్రమగా తోచినా.

అతను జోళ్లు వేసుకోవటం త్వరగా ముగించి, "రా! మేనూ! ఒక్క నిముషంలో బయల్దేరుదాం. ఐయామ్ ఆల్మోస్ట్ రెడీ. రక్ సాక్ సర్దాలి అంతే!" అన్నాడు.

ఆమె ఆ రోజు పెట్టిన పరీక్ష. ఊరుకి ఉత్తరాన పది కిలోమీటర్ల దూరంలో ఉన్న లవర్స్ హిల్లక్ వద్దకు సైకిళ్ల మీదపోయి అక్కడ శిఖరాగ్రానికి ఎగబాకి హృదయాలు ఎగిసి పడే పనులు చేయాలని.

ఆ క్రితం రోజు ఆమె, "చెట్టులెక్కగలవా, నరసింహం? పుట్టలెక్కగలవా? కొండలెక్కగలవా నరహరి? ఆ కొండ లెక్కి నను కౌగిలించగలవా?" అని నిలదీసింది యవన్‌ని.

"ఓ!యా! అవన్నీ చెయ్యగలను. అవన్నీ చేసాక అక్కడే ఒంటికాలి మీద నిలబడి నీ మెడలో మూడు ముళ్లూ వేయగలను. కాని వెయ్యను. ఐ షల్ లీవ్ ఇట్ టు ది ఎల్డర్స్ టు ఎరేంజి అవర్ మారేజ్!" అన్నాడు పెద్దమనిషి తరహాగా.

తన సవాల్‌కి అతని జవాబు విన్నాక మేనుక "అయితే రేపు సాయంత్రమే మన ప్రేమయాత్ర. ఐ డోంట్ మీన్ హనీమూన్. ఐ షల్ లీవ్ ఇట్ టు మై హజ్బండ్ టు ఎరేంజ్" అంటూ వయ్యారాలు పోయింది. ఆ పిల్ల యవన్‌తో తన పెళ్లి గురించి ఫ్రీగా మాట్లాడగలుగుతోంది, ఏ ఇబ్బందీ పడకుండా పెళ్లి మాటెత్తటానికి ఏమన్నా ఇబ్బంది పడ్తే యవన్ పడ్తాడు. దాన్ని వాయిదా వేస్తూ ఉంటాడు. అతని కెక్కడో ఆమెకు తగనేమో నన్న బెరుకు.

ప్రొఫ్ యవన్ తన రక్ సాక్‌లో చల్లటి మంచి నీళ్ల ఫ్లాస్కు, వేడి కాఫీ ఫ్లాస్కు బిస్కెట్లు, యాపిల్స్, కొండ ఎగబాకటానికి తాళ్లు సర్దుకుని, సైకిల్ తీసుకుని బయల్దేరాడు. మేనుక తన సైకిల్ తీసుకుని హఠాత్తుగా వేగం పుంజుకొని "ఫాలోమీ" అంది. అతనామెను అనుసరించాడు.

సాయంత్రం అయిదు గంటలయ్యేసరికి కొండ దిగువకి చేరారు. అప్పటికి ప్రొఫ్. యవన్ చిన్నగా అలసి పోయాడు.

మేనుక "అలసిపోయారా?" అని అడిగింది.

"నాటెటాల్" అన్నాడు యవన్ కొద్దిగా వగరుస్తూ.

కొండపైకి ముప్పావు వంతు దూరం సన్నని కాలిబాట లాంటిది ఉంది. దానిపై

కష్టం మీద సైకిల్ తొక్కుకుంటూ పోవచ్చును.

"పైదాకా సైకిల్ మీద పోదామా" అని అడిగింది మేనుక.

"నువ్వు తొక్కలేవేమో సైకిళ్లు తోసుకుంటూ పోదాం" అన్నాడు యవన్.

"నేను తొక్కగలను. మీకు ఓపికుంటే లెటజ్‌గో" అంది మేనుక.

యవన్ మౌనాన్ని అంగీకారంగా తీసుకుని సైకిల్ ముందుకు దూకించింది. ఆమె ముందు, ఆమె వెనుక...మరీ వెనుక పడిపోకుండా అతను కొండ ఎక్కారు. కాలిబాట నిలిచి పోయిన చోట కొండ కొంత భాగం చదునుగా ఉంది. ఆ చదునుగా ఉన్న భాగంలో ఒకచోట మంటపంలా కట్టి ఉంది. చెలికాడి సరసన చెలికత్తె, చెలికత్తె సరసన చెలికాడు ఉండి మొత్తం మీద వారు మాత్రమే ఉండి వేరొకరు లేకపోతే ప్రేమ అనే ఎండోథర్మిక్ రియాక్షన్ లోపల జరుగుతుందని, చర్య వల్ల దేహాలు వేడెక్కుతాయని, అవి చల్లబడాలంటే సేద తీర్చే గాలి, నీడ ఉండాలని, ఎట్మాస్ఫిరిక్ బౌండరీ లేయర్‌లో భూమినుంచి ఎత్తుకు పోయిన కొద్దీ గాలి ఎక్కువ వేగంగా వీచగలదన్న సూత్రం ప్రకారం గాలి వీచడం వల్ల ఆ విషయంలో బెంగ లేదని ఓ నీడ విషయంలో మానవ ప్రయత్నం అవసరమని ఓ పుణ్యాత్ముడు గుర్తించి ప్రేమ పక్షుల కింత గూడు ఏర్పాటు చేసాడు.

మేనుక, యవన్ ఆ మంటపం కిందకి తమని, సైకిళ్లని చేర్చారు. యవన్ రక్‌సాక్ తెరిచి ఫ్లాస్కులోని చల్లని నీళ్లు రెండు గ్లాసుల్లోకి వంచి, ఒక గ్లాసు మేనుక కిచ్చి రెండోది తను తాగి, "అమ్మయ్య" అనుకుంటూ ఉండగానే-

"ఇవాళ్టి కార్యక్రమంలో కొండ శిఖరానికి ఎగబాకటం ఉండి పోయింది" అంది మేనుక ఉత్సాహం.

అక్కడ్నుంచి కొండ శిఖరం జేరటానికి మనుష్యులేర్పరచిన దారి లేదు. తాళ్లు కట్టుకుని ఎగబాకాలి.

"నాకెత్తుల కెగబాకాలన్న కోరిక లేదు. అయామ్ నాటేంబిషస్" అన్నాడు యవన్ కొద్దిగా భయంగా.

"మనం తెచ్చుకున్నవి తింటూ సరదాగా కబుర్లు చెప్పుకుందాము" అని సూచించాడు కూడా.

"సరే కొద్ది సేపు విశ్రాంతి. ఇంటర్ వెల్ తరువాత కార్యక్రమం కొనసాగుతుంది" అంది మేనుక.

ఆ మంటపంలో, ఆ బండ మీద వెల్లకిలా పడుక్కొని పళ్లు తింటూ బుచ్చిబాబు వ్రాసిన ఎల్లోరాలో ఏకాంతసేవ గుర్తు తెచ్చుకుంటూ, ఆకాశంకేసి యవన్ చూస్తున్న సమయంలో మేనుక బంతిలా లేచి కూర్చుంది. ఆమెను ఎప్పుడు చూసినా యవన్‌కి బంతులు, స్ప్రింగులూ, సెలయేళ్లు, కెరటాలు గుర్తుకొస్తాయి.

లేచికూచున్నాక మేనుక "పదండి కొండ ఎక్కుదాం" అంది. ఆ మంటపానికి ఓ వంద మీటర్ల దూరంలో ఓ ఇరవై మీటర్ల ఎత్తుకి గుండ్రపాటి బండలున్నాయి. ఒకదాని మీద ఒకటి.

"తప్పదా!" అన్నాడు యవన్ నీరసంగా.

"కమాన్! సర్!" అంది మేనుక సరసంగా.

తప్పనిసరిగా లేచాడు. ఆమెను ముందర వెళ్లనిస్తే తను ఆమె పేస్‌లో అనుసరిస్తూ పోవాలి! అంతకంటే తనే నాయకత్వం వహించి కొంచెం గమనాన్ని మందపరచవచ్చు అన్న ఆలోచన యవన్‌కి రాగానే తాళ్లు తీసుకుని ముందు నడిచాడు. అతను ముందు, ఆమె వెనుక ఆ బండల్ని ఎక్కసాగారు తాళ్ల సాయంతో అతను చివరి బండ ఎక్కి నీళ్లు కారి పోయాడు. అప్పటికి మేనుకింకా రెండు మీటర్ల కిందనే ఉంది.

అతను పైకి చేరటం చూసి, "నన్ను పైకి చేదుకోండి స్వామీ" అంది భక్తురాలి భాషననుకరిస్తూ.

"ఇంత పైదాకా వచ్చిన దానివీకాస్త పైకి రాలేవా? మరేం ఫరవాలేదు. నువ్వేపైకిరా" అన్నాడు భగవంతుడు భక్తురాలితో అంటున్నట్టు.

ఆమె పైకి వచ్చి బూరెల్లా బుగ్గలు పెట్టి, "శివ(శ్రీ చచ్చిపోయిందా?" అనేసింది, అలిగి.

"చచ్చిపోయింది శివ(శ్రీకాదు. నేను" అన్నాడు యవన్ మెల్లిగా.

"ఏమిటో గొణిగారు?" అని కాబోయే భార్య అధికారంతో అడిగింది మేనుక.

"ఏం లేదులే" అన్నాడు యవన్ అనుభజ్ఞుడైన భర్తలాగా, అనుభవం లేకపోయినా.

కాస్సేపు ఆ శిఖరం మీద మాట్లాడకుండా కూర్చుని కిందికి దిగి మంటపం జేరారు. ఆ బండ రాళ్ల యుగయుగాల సవ్వడులు విందామని వాటికి చెవి ఆన్చి మేను చాల్చాడో లేదో ఆ సవ్వడులు జోలపాటలై నిద్రపోయాడు అతను.

మేనుక కుదుపుతూ, "చీకటి పడిపోయింది. లెండి సార్!" అంటూ లేపుతుంటే యవన్ లేచాడు. లేస్తూ-

"అయామ్ సారీ కొంచెం అలసిపోయినట్లున్నాను. నిద్రపట్టేసింది" అంటూ క్షమాపణ చెప్పాడు.

సైకిళ్ల మీద ఇంటికి చేరే సరికి అతను పూర్తిగా జావకారి పోయాడు. కుర్చీలో చేరగిలిపోయాడు. మేనుక కాసేపు కూర్చుని చూసింది. యవన్‌లో పెద్దగా చలనం కనిపించలేదు. "ఈ రోజుకింతే. ఈయనింక నాతో గంతులు వెయ్యలేడు" అని తెలుసుకొని ఆమె గుడ్‌నైట్ చెప్పి వెళ్లిపోయింది.

ప్రొఫెసర్ యవన్ ఆమె వెళ్లగానే మంచి నీళ్లు తాగి బట్టలైనా మార్చుకోకుండా మంచంమీద పడుక్కొని నిద్ర పోయాడు.

మర్నాడు నిద్ర లేచేసరికి వళ్లంతా ఒకటే నొప్పులుగా అనిపించింది. యవన్‌కి. నెమ్మదిగా బాత్‌రూమ్‌లోకి పళ్లు తోముకోవటానికి వెళ్లాడు. అద్దంలో మొహం చూసుకున్నాడు. ఆ మొహం కొద్దిగా వడలిన గ్రీకు యువకుడి మొహంలా కనిపించింది. పళ్లు తోముకుని మొహం కడుక్కుని, కళ్లు తుడుచుకొని, అద్దంలోకి శ్రద్ధగా చూసుకున్నాడు. తల వెంట్రుకలు నల్లగానే కనిపించినా వాటి మొదళ్లలో తెల్లని వెండి చుక్కలు కనిపించాయి. అద్దం అమర్చిన తలుపు పక్కకి తెరిచాడు. వెనకాతల అలమారులో వాసమాల్, గోద్రెజ్ మొదలైన రకరకాల కృష్ణకేశ మూలికలు రసాయనాలూ ఉన్నాయి. యవన్ వాటిలో ఒకదాన్ని అలవాటుగా చేతిలోకి తీసుకొన్నాడు. వెండి చుక్కల్ని నల్లబరుచుకొనే ప్రయత్నం మొదలు పెట్టబోయి ఆగిపోయాడు.

తను చిన్నవాడుగా కనిపించాలని చేసే ప్రయత్నాలు ఎప్పుడూ విఫలమవలేదు. తను చిన్నవాడనే అనుకుంటారు అందరూ. అందరిలో ఆడపిల్లలు కూడా ఉన్నారు. ఆడపిల్లల్లో మేనుక తనపట్ల ఆకర్షితురాలైంది. కూడాను. అయితే ఆ అమ్మాయి తనని ఓ కుర్రాడి కిందకట్టి వయస్సులో ఉన్న కుర్రాడు చేయగలిగిన పనులన్నీ తనచేత చేయించాలని చూస్తుంది. ప్రజ్ఞకి పోయి తను చేయబోతాడు. చేయబోయి అలసిపోతాడు! ఆకర్షించటంలో థ్రిల్ ఫీలవుతున్నా అలిసి పోవడంతో సుఖం లేకుండా పోతోంది. ఏజ్ ఈజ్ టెల్లింగ్. నిన్నటికి నిన్న మేనుక తనతో ఉన్నంతసేపు తనకి మేనుకకి పట్టుకుని ఓ చిన్న ముద్దు పెట్టుకుందామన్న ఆలోచన కూడా రాలేదు. తనని ఆమె ఏం చెయ్యమంటుందో, తను ఏం చెయ్యబోయి ఏం చెయ్య లేకపోతాడో, తను కనిపించినంత యవ్వనుడు కాదని ఎక్కడబయట పడి పోతాడో నన్న భయంతో ఆమెతో ఉన్న ప్రతీ క్షణం గడిపాడు. చిన్నవాడిలా కనిపించగలడేమోగాని తను చిన్నవాడు కాలేడు.

తను  ఓ ఆడపిల్లని ఆకర్షించి సాధించగలిగినది ఏమీ లేనప్పుడు ఆకర్షించటం ఎందుకు? అందాన్ని ఆరాధించటం వేరు, దగ్గరకు తీసుకుని భరించటం వేరు. తను మేనుకతో సమానంగా గంతులు వెయ్యలేకపోతున్నాడు. నాగేశ్వరరావు శ్రీ దేవితో సమానంగా స్టెప్పులెలా వేస్తాడో! ఇప్పుడనిపిస్తోంది.

శ్రీదేవితో స్టెప్పులు వేసే అదృష్టం పట్టిన నాగేశ్వరరావుని చూసి ఈర్ష్య పడటం అనవసరమని. ఆమెతో స్టెప్పులు వేసిన రాత్రి ఆయన మోకాళ్లు నొప్పులు పోవటానికి అమృతాంజనం మర్దించుకొంటాడేమో. శ్రీదేవితో స్టెప్పులు వేస్తున్నప్పుడు చిత్తం ఆమె వంపుల మీద కాక అమృతాంజనం బాటిల్ మీద ఉంటుందేమో! ఏమో ఏమిటి! డెఫినిట్‌గా ఉంటుంది. ఆ కాడికి స్టెప్పులు శ్రీదేవితో వేసినా ఒకటే. గంగిరెద్దుతో వేసినా ఒకటే!

తన తల నలుపైనంత మాత్రాన తనకి ఉధృతంగా వలపుల తలపులు కలుగుతాయన్న భ్రమ తనకి లేదు. తనో యవ్వనుడని ఎవర్ని ఫూల్ చేస్తున్నాడు?! ఫూల్స్‌ని! తనని

చేసుకోవటం లేదు కదా! అమాయకురాళ్లైన ఆడపిల్లలు లేక స్త్రీలు తనపట్ల ఆకర్షితులై వచ్చి మీద పడినా, తను పది మందికి కాదు సరికదా ఒక్కరికైనా తను సమఉజ్జీ కాడు. తన పట్ల ఆడవారు ఆకర్షితులవుతున్నారనే భావం కలిగించే ఇగో సంతృప్తి తప్పించి అందులో ఏమీ లేదు. బజారులో ఎన్ని తినుబండారాలున్నా మనం తినగలిగేది మన ఆకలి ననుసరించే కదా!

సమకేశశృతియుతులకు, సమవయస్సు వారికిన్ తమలోన సఖ్యము శృంగారము నగు, కాక నగుబాటు కాదే అసమానులకున్.

ఈ వ్యర్ధ ఆయాసానికి ఇంతటితో ఫుల్‌స్టాప్. ప్రొఫ్. యవన్ అనబడే యదార్థ వాది వరాహ నరసింహం ఈ నిశ్చయానికి రాగానే చేతిలో ఉన్న జుట్టు నల్లబరిచే సాధనాన్ని అలమారులో పెట్టి, తలుపు మూసి అద్దంలో ముఖం చూసుకున్నాడు. అప్పుడూ అద్దంలో ప్రతిబింబం అచ్చు జుట్టు నెరిసిన యాభై యేళ్ల గ్రీకు మగవానిది లాగా కనిపించింది. ఆ ముఖంలో తనేమిటో తెలిసిపోయిన జ్ఞాని ప్రశాంతత ఉంది.

జుట్టు నెరవటం మొదలైనప్పటి నుంచి హితాభిలాషులు జుట్టు రంగు వేసుకోమని, మీసం తీసెయ్యమని పోరు మొదలు పెట్టారు. అందులో, పెళ్లయిన నాడు బ్రహ్మచారి కనిపిస్తే 'వీడు మాత్రం ఎందుకు సుఖపడాలి? ఎల్లాగైనా వీడ్ని ముగ్గులోకి దించుదాం' అని చేసే ప్రయత్నం లాంటిది కాబోలు!

చిన్నగా కనిపించడంవల్ల నా శక్తి సామర్థ్యాలు పెరుగుతాయా! ఏ రంభో వచ్చి 'డార్లింగ్! హాయ్!' అంటే, 'ఏమిటి చెల్లాయ్!' అనే కదా అనగలిగింది. నా కొద్దు ఈ నల్లటి జుట్టు బతుకు" అనుకొన్నాడు వరాహనరసింహారావు.

మన దేశంలో వయస్సులో ఉన్న స్త్రీలకి ఎన్ని ఇబ్బందులు! ఆఖరికి పోలీసుల నుంచీ కూడా రక్షణ లేదు. అల్లాంటప్పుడు ప్రమాద దశ దాటిన స్త్రీలు, జుట్టు నల్లబరుచుకొని చిన్నవారిలా కనిపించి ప్రమాద దశని కొనసాగించుకోవడం గురించి సానుభూతితో ఆలోచించాడు.